నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 8 డిసెంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

సమస్యల పరిష్కారానికి పోరాటం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్షకు సంఘీభావం

సమగ్ర శిక్షా ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 7 : సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయ వైధ డిమాండ్ల సాధన కోసం ఆమరణ దీక్షకైనా వెనుకాడబోమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదురుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ నేతలు గద్దెనెక్కారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి చాయ్ తయారయ్యేలోపు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే జీవోను తెస్తామని నేతలు చెప్పారని.. అయితే మరి చాయ్ దొరకలేదా..? చాయిపత్తా లేదా..? చక్కెర లేదా..? పాలు లేవా..? గ్యాస్ లేదా..? అంటూ మండిపడ్డారు. ఇందుకోసం మేం ఏడాది కాలం పట్టిందని ఎద్దేవా చేశారు. న్యాయ వైధ డిమాండ్ల సాధన కోసం పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి ఉందన్నారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారని, రైతులు, ఉద్యోగులు.. అన్ని రంగాల ప్రజలను రేవంత్ సర్కారు మోసం చేసిందన్నారు. కనీస వేతనం, మినిమం టైం స్కేల్, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి వాహిద్ పాల్గొన్నారు.

వాలీబాల్ ఆడుతూ కుప్పకూలిన విద్యార్థి

- వనపర్తి దవాఖానకు తరలించిన ఉపాధ్యాయులు
- అప్పటికే మృతిచెందాడని నిర్ధారించిన వైద్యులు

సాయిప్రణీత్ (ఫైల్)

పెద్దమందడి, డిసెంబర్ 7 : సీఎం కప్ క్రీడా పోటీల్లో విషాదం చోటు చేసుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో పాల్గొన్న ఓ విద్యార్థి కుప్పకూలి పోయాడు. ఉపాధ్యాయులు దవాఖానకు తరలించేలోపే మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లాలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. పెద్దమందడి మండలం బలి జుల్లి, జంగాయపల్లి జంట గ్రామాల ఉన్నత పాఠశాలలో సీఎం కప్ పాఠశాల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. అదే పాఠశాలలో చదువుతున్న ముందరితండా (పామిరెడ్డిపల్లితండా)కు చెందిన 10వ తరగతి విద్యార్థి సాయిప్రణీత్ (16) శనివారం వాలీబాల్ ఆడుతూ కళ్లు తిరుగుతున్నాయని చెప్పి కిందపడిపోయాడు. వెంటనే ఉపాధ్యాయులు వారి సొంత వాహనంలో వనపర్తి దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే ఉదయం ఒకసారి కండ్లు తిరుగుతున్నాయని విద్యార్థి చెప్పడంతో అతడి తల్లి లీలమ్మ దవాఖానకు చూపించి పాఠశాలకు పంపించింది. ఈ క్రమంలో ఆటలు ఆడుతుండగా.. ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. సాయి 6వ తరగతి నుంచి అదే పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. తండ్రి రవి దుబాయిలో ఉంటుండగా.. అతడి తల్లితో కలిసి తండాలో ఉంటున్నాడు. ఇతడికి అక్క, తమ్ముడు ఉన్నారు. విద్యార్థి మృతితో తండాలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ విషయంపై పాఠశాల హెచ్ఎం మంజులతను ఫోన్‌లో వివరణ కోరగా.. తర్వాత ఫోన్ చేస్తానంటూ కట్ చేసింది. అదేవిధంగా విద్యార్థి సాయిప్రణీత్ ఒక్కసారిగా కుప్పకూలిన సంఘటనను చూసిన మరో విద్యార్థిని ప్రియ అపస్మారక స్థితికి వెళ్లగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

వనపర్తిలో నిరసన చేపడుతున్న బీఆర్ఎస్, విద్యార్థి సంఘాల నేతలు

- రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- వనపర్తిలో బీఆర్ఎస్, విద్యార్థి, గిరి జన సంఘాల రాస్తా రోకో

వనపర్తి టౌన్, డిసెంబర్ 7 : సీఎం కప్ క్రీడలు ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలిన విద్యార్థి సాయిప్రణీత్ కుటుంబాన్ని ఆదుకోవాలని విద్యార్థి, గిరి జన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ, గిరిజన విద్యార్థి, పీడీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్‌లో రాస్తారోకో చేపట్టారు. ఘటనా స్థలానికి కలెక్టర్ రావాలని, విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని పెద్ద ఎత్తున నినాదించారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే జిల్లా బంద్‌కు వెనుకాడబోమని, పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాలుగు గంటలపాటు ధర్నా చేపట్టినా స్పందించక పోవడంపై ఆగ్రహం చెందారు. కాగా ఓ వైపు ఆందోళన కొనసాగుతుండగా.. ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఆర్డీవో జిల్లా దవాఖానకు చేరుకొని సాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. నిరసనలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, రాము, విద్యార్థి సంఘాల నేతలు జాత్యనాయ్, హేమంత్, గిరి, శివ, రాము, పవన్, మృతుడి కుటుంబీకులు పాల్గొన్నారు.

ఎస్ఎన్ఎస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

- 200 మందితో తాసీల్దార్‌కు వినతి

ఎర్రవల్లి చౌరస్తా, డిసెంబర్ 7 : మండలంలోని జింకలపల్లి గ్రామంలో ఉన్న ఎస్ఎన్ఎస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని నాయకులు శ్రీధర్ రెడ్డి, రవి రెడ్డి, గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం షేక్‌పల్లి, కొండేరు, జింకలపల్లి, దువా నెల్లి, బీ వీరాపురం, పుటా నెల్లి, మునగాలకు చెందిన 200 మందితో కలిసి శనివారం తాసీల్దార్ నరేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎన్ఎస్ కంపెనీ నుంచి వెదజల్లు తున్న విషపూరిత వైధ కాలుష్యాన్ని నివారించాలని, దుర్వాసనతో శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయన్నారు. జీవించే హక్కును కాలరాస్తున్న కంపెనీని శాశ్వతంగా మూసివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసీల్దార్ మాట్లాడుతూ వారం కిందట కలెక్టర్ ఆదేశాల మేరకు కంపెనీని తనిఖీ చేయడానికి వెళ్తే.. పది నిమిషాల వరకు గేట్ కూడా తెరవలేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి రెడ్డి, శ్రీధర్ రెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, వీరన్న, ఈదన్న, సుధాకర్ రెడ్డి, వీరన్న, సంజీవనాయుడు, ఈశ్వర్ రెడ్డి, శ్రీకాంత్, వీర బాబు, శేషు, నారాయణ, మద్దిలేటి, శివ, గోవింద్, చిన్న మద్దిలేటి, గ్రామస్తులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



తాసీల్దార్ నరేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న జింకలపల్లి గ్రామస్తులు

పాలమూరులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు (ఫైల్)

ఎదురుచూపులు!

- కేసీఆర్ ప్రభుత్వంలో పాలమూరు జిల్లాకు 8,566 'డబుల్' బెడ్రూం ఇండ్లు మంజూరు
- 7,811 ఇండ్లకు పూర్తయిన టెండర్లు.. 5,440 నిర్మాణాలు పూర్తి
- పూర్తి చేసేందుకు ఇంకా రూ.70 కోట్లకుపైగా.. నిధులు అవసరం
- సిద్ధమైన ఇండ్లకు పట్టాలిచ్చినా తాళాలు ఇవ్వని అధికారులు

కలల సౌధంలోకి కాలుపెట్టేదెన్నడో..?

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, డిసెంబర్ 7 : కేసీఆర్ ప్రభుత్వం గూడులేని నిరుపేదల కోసం ప్రతిష్టాత్మకంగా డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించింది. అయితే చాలా చోట్ల నిర్మాణాలు పూర్తయినా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో తమకు ఇండ్లు ఎప్పుడిస్తారంటూ పాలమూరు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమకు ఇండ్లు కేటాయించినా.. కాంగ్రెస్ సర్కారు హయాంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. పాలకులు, అధికారుల నిర్లిప్తతో పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. త్వరగా అందిస్తే ఇండ్లకు తోరణాలు కట్టి.. ఇంట్లో పాలు పొంగించాలనుకున్నా.. వారికి నిరాశే మిగిలింది. చాలా చోట్ల నిర్మాణాలు పూర్తయినా.. లబ్ధిదారుల ఎంపిక జరిగినా.. అర్హుల చేతికి ఇంటి తాళాలు మాత్రం అందించడం లేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. వాటి మధ్యన పిచ్చిమొక్కలు మొలిచి శిథిలావస్థకు చేరాయి. వెచ్చించిన రూ.కోట్లు వృథా అవుతున్నాయి.

అర్హులకే ఇండ్ల కేటాయింపు

పేదల సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో కేసీఆర్ పాలనలోనే పాలమూరులో డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించారు. నిర్మాణాలు పూర్తి కావడంతో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. భూములు కోల్పోయిన బాధితులతోపాటు అర్హులైన పేదలకు సైతం కొన్ని ఇళ్లను కేటాయించారు. అయితే కొన్ని చోట్ల వివాదం నెలకొన్నది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

మహబూబ్‌నగర్ జిల్లాకు మొత్తం 8,566 ఇండ్లు మంజూరయ్యాయి. వీటిలో 7,811 ఇండ్లకు టెండర్లు పూర్తి కాగా 5,440 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రాష్ట్రంలోనే అత్యంత వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వారిలో మూడో స్థానంలో పాలమూరు నిలిచింది. ఇంకా 491 ఇండ్ల నిర్మాణం పూర్తయ్యే దశలో ఉండగా.. పురోగతిలో 851.. ఇంకా 1,784 ఇండ్ల ప్రారంభించలేదు. ప్రస్తుతం పురోగతిలో ఉన్న, ప్రారంభించని ఇళ్ల నిర్మాణాలకు సుమారు రూ.70 కోట్లకుపైగా నిధులు అవసరం ఉన్నాయి.

తాళాలు ఇవ్వని దుస్థితి

మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్లలోని పలు ప్రాంతాల్లో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించారు. వాటిలో నిర్మాణాలు పూర్తయిన ఇండ్లకు లబ్ధిదారులను కేటాయించడం లేదు. పాలమూరు పట్టణంలోని మౌలాలి గుట్ట వద్ద జీప్లస్-2 విధానంలో ఇండ్లు నిర్మించి.. చాలా మందికి కేటాయించినా నేటికీ ఇంటి తాళాలు తీయనీయడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అర్హులకు ఇళ్లు కేటాయించి.. తమ సొంతింటి కలను నెరవేర్చాలని పేదలు కోరుతున్నారు.

అధికారుల్లో కొరవడిన స్పష్టత

గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేసిన ఇండ్లను గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యికి పైగా పట్టణ ప్రాంతాల్లో రూ.3 వేలకు పైగా ఇండ్లు కేటాయించారు. వీరిలో చాలా మంది లబ్ధిదారులకు ఇండ్లను అప్పగించలేదు. కొన్ని చోట్ల చాలా మందికి కేటాయించలేదు. కేవలం జాబితాను మాత్రం తయారు చేశారు. ఇప్పుడా ఇళ్ల వద్దకు జాబితాలో ఉన్న లబ్ధిదారులు వస్తుండగా ఎలా వస్తారని అధికారులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని చోట్ల లక్కీడిప్ నిర్వహించారు. మరి కొన్ని చోట్ల ఇండ్ల నిర్మాణాలకు అనుగుణంగా కొందరికి మాత్రమే పట్టాలు ఇచ్చి.. ఆ తర్వాత పలువురు లబ్ధిదారులకు అందించినా అవి ఎలా కేటాయించరన్న దానిపై అధికారుల్లోనే స్పష్టత లేదంటూ.. అధికారులు ఇళ్ల తాళాలు ఇచ్చేందుకు విముఖత చూపెడుతున్నారు. తాళాలు ఇవ్వక పోవడంతో వృథాగా పడి ఉన్నాయి.

మహబూబ్‌నగర్‌లో పట్టాలిచ్చినా.. ఇళ్లు చూపడం లేదంటూ సెప్టెంబర్ 23న ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన లబ్ధిదారులు

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

ఫిర్యాదు చేస్తున్న వెలమ సంఘం నాయకులు

కొల్లాపూర్, డిసెంబర్ 7 : వెలమ సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన వెలమ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై హృషికేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెలమ సంక్షేమ సంఘం నియోజకవర్గ నాయకుడు ఎన్మన్‌బెట్ల సురేందర్ రావు మాట్లాడుతూ శాసనసభ్యుడిగా ఉన్నతమైన పదవిలో ఉండి ఓ సామాజిక వర్గాన్ని అకారణంగా.. అసభ్య పదజాలంతో దూషించడం సరికాదన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎమ్మెల్యే శంకర్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బెదిరింపులకు వెలమ సామాజిక వర్గం భయపడదన్నారు. బాధ్యతారహిత వైధ వాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం నాయకులు కమలాకర్‌రావు, రామచంద్రరావు, బిచ్చారావు, రఘుపతిరావు, మధుసూధన్‌రావు, తిరుపతిరావు, రాజు, శ్రీనివాసులు నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలాల నిరసన

నాగర్‌కర్నూల్ రూరల్, డిసెంబర్ 7 : జిల్లా కేంద్రంలోని శ్రీపురం చౌరస్తాలో ఆటో ట్రాన్స్‌పోర్టు యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో ట్రాన్స్‌పోర్టు యూనియన్ అధ్యక్షుడు కురుమూర్తి, ప్రధాన కార్యదర్శి రామయ్యలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మిక సంఘాలు శనివారం నిర్వహించతలపెట్టిన బంద్ ప్రభుత్వం చర్చలకు పిలవడంతో వాయిదా పడిందన్నారు. రాష్ట్రంలో ఆటో ట్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల న్యాయ వైధ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినా పట్టించుకోక పోవడంతో ఆటో క్యాబ్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏడాదికి రూ.12 వేల ఇస్తామని చెప్పినా రూపాయి ఇవ్వలేదని వాపోయారు. నేటి వరకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఫ్రీబస్సు సౌకర్యం కల్పించి ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై దెబ్బ కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదుకుంటామంటూ సీఎం, రవాణా శాఖ మంత్రి కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. దీంతో ఫైనాన్స్ డబ్బులు కట్టలేక పలువురు ఆటోలు అమ్ముకుంటున్నారని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. 9 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆటో రవాణా రంగ కార్మికుల సమస్యలపై చర్చించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రవాణారంగం కార్మిక నాయకులు

వేక్ యాప్ మోసం

- రూ.4.60 లక్షలు గోవిందా..

గోపాల్‌పేట, డిసెంబర్ 7 : వేక్ యాప్ ద్వారా మోసపోయిన వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన గోపాల్‌పేట మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు.. మండలంలోని ఏదుల గ్రామానికి చెందిన కోడిగంటి రంజిత్ కుమార్ (32) గత ఫిబ్రవరిలో వేక్ యాప్‌లో తన అకౌంట్లో, తన భార్య అకౌంట్లో ఉన్న రూ. 4.60 లక్షలు ఇన్వెస్ట్‌మెంట్ పెట్టాడు. మొదట కొంత డబ్బు రిటర్న్ వచ్చింది. కొన్ని రోజుల తర్వాత యాప్ పని చేయడం లేదు. దీనితో మోసపోయానని తెలుసుకున్న రంజిత్ శనివారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డెక్కిన మహిళలు

- రెండు నెలలుగా మిషన్ భగీరథ వాటర్ రావడం లేదని ఆగ్రహం

కొల్లాపూర్ రూరల్ డిసెంబర్ 7 : పట్టణంలోని కొన్ని వార్డుల్లో తాగునీరు రావడం లేదని మహిళలు రోడ్డెక్కారు. స్థానిక 12, 13వ వార్డులకు చెందిన పలువురు మహిళలు, స్థానికులు ఖాళీ బిందెలతో కొల్లాపూర్‌లోని గాయిత్రి కళాశాల చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు నెలల నుంచి మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీళ్లు రావడం లేదని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకొని నేడు మా సమస్యలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. గంటసేపు రాస్తా రోకోచేయడంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌన్సిలర్ నర్సింహులు దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ టౌన్ వర్కింగ్ ప్రసిడెంట్ కట్టా శ్రీనివాసులు, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రమేశ్ రాథోడ్, పరమేశ్, పురేందర్, ఇమ్రాన్, శేఖర్, అర్జున్‌గౌడ్, కురుమయ్య పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న వార్డు ప్రజలు

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 7 : పల్లెల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఎమ్మెల్యే విజయుడు ఆదేశించారు. శనివారం ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామంలో అంగన్‌వాడీ చిన్నారులకు పాఠశాల దుస్తులును ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల్లో ఆహార లోపాన్ని నివారించేందుకు వివిధ రకాల పౌష్టికాహారం అందజేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఉండే అంగన్‌వాడీ కేంద్రాలకు కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వెళ్లి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. దీంతో ఆరోగ్యంగా ఉంటారని, తల్లి, పుట్టబోయే శిశువులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రతిరోజు ఆటపాటలతో పాటు చదువు నేర్పిస్తూ ప్రతి వారం వారి ఆరోగ్యం, బరువు చూడాలని అన్నారు. చిన్ననాటి నుంచే చిన్నారులకు చదువుపై ఆసక్తి పెరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కంపించిన భూమి

- భయంతో వణికిన దాసర్‌పల్లి
- ఇండ్ల నుంచి పరుగులు పెట్టిన జనం
- రిక్టర్ స్కేలుపై 3.0గా నమోదు

భూకంపం వచ్చిన దాసర్‌పల్లి గ్రామం

దేవరకద్ర రూరల్(కొకుంట్ల), డిసెంబర్ 7 : భూమి కంపించడంతో స్థానికులు భయంతో పరుగులు పెట్టిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. కొకుంట్ల మండలం దాసర్‌పల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం 12:15 గంటల సమయంలో స్వల్పంగా భూమి కంపించింది. ఈ పరిణామంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు భయంతో ఇండ్ల నుంచి కొందరు బయటకు రాగా.. మరి కొందరు ఏం జరుగుతుందో తెలుసుకునేలోగా అంతా ముగిసింది. దీంతో ఇండ్లల్లోని వస్తువులు కిందపడ్డాయి. వంట గిన్నెలు కదిలి చెల్లాచెదురుగా పడ్డాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.0గా నమోదైంది. కొద్దిపాటిగా భూకంపం రావడంతో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా మూడ్రోజుల కిందట ములుగు జిల్లాలో కూడా భూకంపం సంభవించింది.

భూకంపం రావడంతో కిందపడ్డవంటపాత్రలు

కాంగ్రెస్‌లో వర్గపోరు

ధన్వాడ, డిసెంబర్ 7 : మండలంలోని గున్ముక్ల గ్రామంలో నారాయణపేట మ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి శనివారం గుట్టుచప్పుడు కాకుండా సీసీ రోడ్డును ప్రారంభించారు. కేసీఆర్ ప్రభుత్వ హయంలో నాటి ఎంపీ, ఎమ్మెల్యేలు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.22 లక్షల నిధులు మంజూరు చేయించారు. కాగా ఈ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గం నేతలు బహిష్కరించగా మరో వర్గం నేతలు ఎమ్మెల్యే చేత గుట్టుచప్పుడు కాకుండా ప్రారంభింపజేశారు. కనీసం మీడియాకు కూడా సమాచారం ఇవ్వక పోవడంతో చర్చనీయాంశంగా మారింది.

అర్చకుడు ఆనంద్‌శర్మకు షోకాజ్ నోటీస్

అయిజ, డిసెంబర్ 7 : అలంపూర్‌లోని జోగులాంబ, బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాల ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మకు ఈవో పురందర్‌కుమార్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. గత నెల 23న కర్నూల్‌లోని ఆనంద్ సినీ కాంప్లెక్స్‌లో సినిమా తిలకించేందుకు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఫ్యామిలీతో కలిసి వెళ్లాడు. అయితే అర్చకుడు ఆనంద్‌శర్మ అదే థియేటర్‌కు వెళ్లి ముఖానికి గుడ్డ అడ్డం పెట్టుకుని ఎమ్మెల్యే ఫొటోలు, వీడియోలు తీశాడు. ఈ విషయమై ఎమ్మెల్యే విజయుడు తన వ్యక్తిగత జీవితానికి భంగం కలిగించడం, మా ప్రతిష్ట దెబ్బతినే విధంగా చేసిన ఉప ప్రధాన అర్చకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కర్నూల్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై వివిధ దిన పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఉప ప్రధాన అర్చకుడిపై దేవాదాయ చట్టం 30/87లోని సెక్షన్ 37 అనుసరించి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేశారు. 10రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని.. ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని ఈవో పేర్కొన్నారు.

బంగారం కోసం..

- వృద్ధురాలి గొంతుకోసిన యువకుడు

నవాబ్‌పేట, డిసెంబర్ 7 : మండలంలోని ఫతేపూర్ మైసమ్మ అడవిలో వృద్ధురాలిపై ఓ యువకుడు కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకున్నది. ఎస్సై విక్రమ్ కథనం మేరకు.. మండలంలోని పల్లెగడ్డ గ్రామానికి చెందిన వృద్ధురాలు అక్కమ్మ(62) జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు నవాబ్‌పేట బస్టాండ్‌లో ఉన్నది. ఈ సమయంలో కూచూర్ గ్రామానికి చెందిన యువకుడు కరుణాకర్ రెడ్డి ఆమెకు మాయమాటలు చెప్పి మండల కేంద్రంలో ఇద్దరూ కల్లు తాగారు. అనంతరం ఆమెను పాలమూరుకు తీసుకెళ్తానని చెప్పి ఫతేపూర్ మైసమ్మ అడవిలోకి తీసుకెళ్లాడు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలు తస్కరించాలని తన వెంట తెచ్చుకున్న పదునైన కత్తితో ఆమె మెడ కోశాడు. తేరుకున్న అక్కమ్మ కేకలు వేసుకుంటూ రోడ్డుపై వచ్చి అటుగా వెళ్తున్న ప్రయాణికులకు విషయం తెలిపింది. వారు అడవిలోకి వెళ్లి పరిశీలించగా తాగిన మైకంలో అడవిలో ఉన్న కరుణాకర్ రెడ్డిని రోడ్డుపైకి ఈడ్చుకొచ్చి దేహశుద్ధి చేశారు. అక్కమ్మను చికిత్స నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు వృద్ధురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరుణాకర్‌రెడ్డిపై ఇప్పటికే పలు నేరారోపణలు ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

దశదిన కర్మ
మంచి మనిషి మా అందరిని సన్మార్గంలో నడిపి నీవు మాత్రం దైవసన్నిధి కేగినావు. నీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... బాధతప్త హృదయాలతో....
భర్త:
స్వర్గీయ శ్రీమతి
నామాల చంద్రమ్మ గారు
102 సం.లు. మరణం: 28.11.2024
కీ.శే. నామాల గాలయ్య గారు
మనవళ్ళు, మనవ